### 3.5.5 -ఆయన:

"ఆయన మంచివాఁ-డందు పై నెపుడు"(2:421)

"ఆయన కనుకూల-వై యుండు నీవు"(2:913)

## 3.6 నామ విభక్తులు-రూపనిష్పత్తి (case declension)

నామాలపై చేరే ప్రత్యయాలను నామ విభక్తి ప్రత్యయాలంటారు. డు, ము, వు, లు ఇత్యాదులను నామ విభక్తి ప్రత్యయాలుగా సంప్రదాయ వ్యాకరణాలు వివరించాయి. అయితే; చారిత్రకంగా వీటిలో చాలావరకు స్వతంత్ర ప్రయోగ ప్రతిపత్తి కల్గిన పదాలు ఉన్నాయి. విభక్తి రూపాలలో లింగ, వచన ప్రత్యయాల తర్వాత చేరే వీటిని ఈ అధ్యయనంలో ప్రత్యయాలుగానే గ్రహించడం జరిగింది. వీటిలో ప్రథమా విభక్తి ప్రత్యయాశ్రయం కాదు (unmarked). తక్కిన ద్వితీయాది విభక్తులు ప్రత్యయాశ్రయాలు(marked). ఇవి అనౌప విభక్తి నామాలు అన్న విభాగంలో చర్చించబడ్డాయి. వీటితోపాటు ఔపవిభక్తి నామాల చర్చకూడా ఈ విభాగంలో ఉంది.

### 3.6.1 ఔపవిభక్తిక/అనౌపవిభక్తిక నామాలు

నామాలను ఔపవిభక్తిక, అనౌపవిభక్తిక భేదాలతో రెండు రకాలుగా విభజించవచ్చు. ద్వితీయాది విభక్తి ప్రత్యయాలకు ముందు కొన్ని నామాలు ఔపవిభక్తిక ప్రత్యయాన్ని గ్రహిస్తాయి. ఫలితంగా ఔపవిభక్తిక రూపాలు ఏర్పడతాయి. కొన్ని నామాలు ఔపవిభక్తిక ప్రత్యయాలను గ్రహించకుండా ద్వితీయాది విభక్తి ప్రత్యయాలను నేరుగా గ్రహిస్తాయి. ఇలా ఏర్పడే నామాలు అనౌప విభక్తిక నామాలు.

### 3.6.2 ఔపవిభక్తికాలు (inflexional increments)

సంప్రదాయ వ్యాకర్తలు -ఇ, -తి, -టి, - ంటి లను ఔపవిభక్తికాలుగా గుర్తించారు. ("ఇ-టి-తి వర్ణంబులు వక్ష్యమాణంబు లౌపవిభక్తికంబులు", "ఇవి ద్వితీయాద్యేక వచనంబులు పరంబులగునపుడు నామంబులకుం గొన్నింటికిం బ్రాయికంబుగ నగు", "ఊరు మొదలగువాని కిత్వం బగు", "టివర్ణంబు గొన్నింటి యంతాక్షరంబున కాదేశంబును గొన్నింటి కంతాగమంబును గొన్నింటికిం బర్యాయంబున రెండును బ్రాయికంబుగ నగు", "హ్రస్వముమీఁది టివర్ణకంబు ముందు పూర్ణ బిందువు బహుళముగా నగు", "పదాద్యంబగు హ్రస్వంబుమీది టివర్ణంబునకు ముందు

పూర్ణబిందు వగు", "అఙ్ఞు మొదలగు శబ్దముల కంతాగమంబు తివర్ణమబును రేఫంబున కొక్కటికి లోపంబునగు", "విభక్తి పరంబగునపుడు గోయి ప్రభృతుల తుది యక్షరంబు తివర్ణకం బగు", "టితి వర్ణంబులు పరంబులగునపు డుత్వంబున కిత్వంబగు", "టివర్ణంబు పరంబగునపుడు క్రిందు మీఁదు ముందు వు వర్ణమబుల కత్వం బగు", "ఔపవిభక్తికముల తృతీయా సప్తముల కత్వం బాదేశంబు బహుళంబుగా నగు" (చూ. బాలవ్యా. ఆచ్ఛిక.:28-38))

వీటితోపాటు శ్రీ రామాయణం కావ్యంలో -ని, -అటి, -ఇటి, -అ అనే ఔపవిభక్తిక ప్రత్యయాలు గుర్తించబడ్డాయి.

## 3.6.2.1 -ఇ:

(i) నామాలపై "-ఇ" అనే ఔపవిభక్తిక ప్రత్యయం ఆగమంగా వస్తుంది.

కాలు: కాలికి మెడకంట(1:3990)
కాలిగోరునకు(5:3911)
కాలిదుమ్ము(6:242)
కాలి మెట్టులను(6:8169)
కాలిత్రోవ(2:6215)

ఊరు: ఊరికిఁబోవు(2:9916)
ఊరిలో నింటింట(5:4115)

(ii) స్థలవాచక నామాలపై "-ఇ" అనే ఔపవిభక్తిక ప్రత్యయం ఆగమంగా వస్తుంది.

లోన: కడుపులోనికిఁజొచ్చి(1:3529)
నగరిలోనికి(6:12178)

లోపల: పురములోపలికి(5:433)
కడలిలోపలి(5:1231)
లోపలి యిండ్లలో(5:4279)
నగరిలోపలికేఁగి(6:751)

ఇచ్చట: ఇచ్చటికి(2:1742)

ఇచట: ఇచటికిఁబిల్వ(2:1763)
ఇచటి మునులు(2:10503)

అచ్చట: అచ్చటిభక్ష్యభోజ్యాది(5:887)

అచట: అచటి పనికి(5:1295,96)
అచటికిఁబొమ్మని(4:954)

ఎచ్చట: ఎచ్చటికో కొంచునేఁగిన(2:6684)
ఎచ్చటి కరిగితివీవు(2:7501)

ఎచట: ఎచటికిఁ గొనిపోవు(3:5577)
ఎచటికిఁ బోనేల?(2:5473)

ఎక్కడ: కొనసాగ ఎక్కడిది(2:9612)
ఎక్కడివాపదలిఁక(3:471)

చెంగట: పశ్చిమ వనధి చెంగటికి(3:882)
అతని చెంగటి(4:1964)

పైన: పట్టుపైని పుప్పొళ్ళు(4:2877)
పాలికలపైనిచ్చి(5:726)

(iii) వారు అనే ప్రథమ పురుష సర్వనామంపై కూడా "-ఇ" ఆగమం చేరుతుంది.

వారు: ఓడినవారి కన్యలనెల్లఁ (5:950)
నిద్రలు వోవువారి(5:1066)
చెఱఁజిక్కువారిఁ జూచి(5:1190)
తల్లులు-వారితో వారు(5:1219)
వారికి మునుపుగా(5:1220)
వారిని బోలె(5:2030)

## 3.6.2.2 -తి:

చేయి, నేయి వంటి నామాల చివరి "-యి" కి "-తి" అనే ఔపవిభక్తిక ప్రత్యయం ఆదేశంగా వస్తుంది.

చేయి: జనపతి చేతి-పచ్చల కడియము(1:1475)
లక్ష్మభు చేతి యమ్ముల విల్లు(1:2243)
దైత్యుల చేతిపోరు(1:2500)
చెలి చేతికిచ్చి(1:5306)

నేయి: గోధుమ నేతి(2:8500)
నేతి కుండలను(1:3048)
నేతి బిందెలవలెఁ(3:6261,62)
నేతి ముద్ద(3:6143)

## 3.6.2.3 -టి:

(i) కింది నామాల చివరి అక్షరాలపై "-టి" అనే ఔపవిభక్తిక ప్రత్యయం ఆదేశంగా వస్తుంది.

త్రాడు: కోతిని త్రాటి నీడిచికొని...(5:3841,42)

నోరు: నోటిలో నిండిన-నురుగు...(3:5721)
పై నోటివారి(5:516)

(ii) అంత, ఇంత, ఎంత అనేరూపాలపై "-టి" అనే ఔపవిభక్తికం చేరిన రూపాలు శ్రీరామాయణంలో కనిపిస్తున్నాయి.

అంత: అంతటికున్నదె(4:5269)
ఇంత: ఇంతటి వానికి(5:3923)
ఎంత: ఎంతటి పనియిది(3:5665)

(iii) "-టి" అనే ఔపవిభక్తికం పరమైతున్నపుడు "ఏమి" శబ్దంలోని మికారానికి లోపం వైకల్పికంగా వస్తుంది.("టి వర్ణంబు గొన్నింటి యంతాక్షరంబున కాదేశంబును గొన్నింటి కంతాగమంబును

గొన్నింటికిం బర్యాయంబున రెండును బ్రాయికంబుగ నగు" (బాలవ్యా. ఆచ్ఛిక.:31), "హలవసానంబులు పరంబులగు నపుడేమి శబ్దముయొక్క మికారమునకు లోపంబు వైకల్పికంబు" (ప్రౌఢవ్యా. సంధి.:16))

ఏమి: ఏమి-టి-కి(2:6003)
"ఏమిటికినిఁ గొఱ-యె?..."

ఏటికి(5:2143)
"ఏటికి రాఁడొకొ-యిన్నాళ్ళు?..."

## 3.6.2.4 - ంటి:

కింది నామాలపై "- ంటి" అనే ఔప విభక్తిక ప్రత్యయం చేరుతుంది.

ఇల్లు: మా యింటిలోన...(1:15)
"మనయింటి కాతఁడే-మతమునవచ్చు"(1:1070)
తన యింటిలో(1:4764)
జనకుని యింటికి (1:5050)
ఇంటికిని బనిచి(2:803,4)

కన్ను: కంటికి ఱెప్ప(2:4276)
కంటికి నిద్దుర(2:5098)
నిదుర కంటికి వచ్చునే(2:6081)
కంటివె(2:10521)
కంటివే(2:7547)
కంటిరే(2:8971)
కంటిని మీ శుభాకారముల్...(3:512)

ఒక: ఒంటికా నచ్చోట-నున్నట్టి...(3:1517)
ఒంటిగా నీవు(3:1578)
ఒంటిగా నున్న (3:2930)
ఇంటి ఒంటి యుండఁగ(3:5713, 14)
ఇన్నాళ్ళు నొంటి నిటమీద(3:5897,98)

## 3.6.2.5 -ని:

మహదేకవచన ప్రత్యయమైన "-ఁడు"తో అంతమయ్యే నామాల చివరి "ఁడు"ని తొలగించి "ని" వస్తుంది. సంస్కృత ప్రాతిపదికలమీద ఈ ఆదేశం వికల్పం.

(i) సంస్కృత ప్రాతిపదికలలో -ని ఆదేశం వచ్చి లోపించిన రూపాలు:

"నోరాడకున్న మ-నో నాథుతోఁడ" (2:2870)

"...వధియింపుదునని-కపినాథుతోఁడ" (5:3996)

"వలదమ్మ! నీప్రాణ-వల్లభుతోఁడ(3:3681)

(ii) సంస్కృత ప్రాతిపదికలలో -ని ఆదేశం వచ్చి లోపించని రూపాలు:

"నమ్మించినాఁడు నీ-నాథుని మొదట" (5:4990)

"లక్ష్మణ సుగ్రీవు-లను రామ విభుని" (6:60)

(iii) సంస్కృత మహదేకవచన ప్రత్యయాల "ఁడు" కి "ని" ఆదేశం రావటం:

ఘనుఁడు: "ఘను-ని దిలీపునిగాంచి..." (1:3207)

సుతుఁడు: "సుతు-ని మాట వినుపించుటయును" (1:3298)

(iv) దేశ్య ప్రాతిపదిలలో "ని" ఆదేశం వచ్చి లోపించిన రూపాలు లేవు.

మగఁడు: మగ-ని యనుమతి(2:3295, 96)

## 3.6.2.6 -అటి:

కింది పదాలపై "-అటి" అనే ఔపవిభక్తిక నామం చేరుతుంది.

రేపు-అటి "రేపటికి మా-యింట విందారగించి..." (2:8257, 58)

చనుము రేపటికి (6:11706)

మునుపు-అటి "మునుపటి శ్రుతిశీల-ములు..."(2:6956)

ముందు-అటి "ముందటిలోన-రణభూమిలోన" (6:621)

## 3.6.2.7 -ఇటి:

పేరు-ఇటి పేరిటి నాఁచు (2:5911)
పేరిటి గరళంబు (2:4548)

## 3.6.2.8 -అ:

కన్నులు-అ కన్నుల నశ్రులు రాల(4:2358)

తను-అ తన భర్తతో (4:2400 తర్వాతి వచనంలో)

## 3.6.3 ఔపవిభక్తిక అనౌపవిభక్తిక రూపాల పర్యాయత

శ్రీ రామాయణం కావ్య భాషలో "నేయి" వంటి కొన్ని నామాలు కొన్ని సందర్భాలలో ఔపవిభక్తిక రూపాలుగా, మరికొన్ని సందర్భాలలో అనౌపవిభక్తిక రూపాలుగా కనిపిస్తున్నాయి.

| | **ఔపవిభక్తిక రూపం** | **అనౌపవిభక్తిక రూపం** |
|---|---|---|
| నేయి: | లాజలు నేయిపాలాశముల్ (1:5407) | గోధుమనేతి కజ్జంబులు (2:8500,501) |

## 3.6.4 ప్రథమా విభక్తి రూపాల నిర్మాణం

ప్రథమా విభక్తిని బోధించే ప్రత్యయాలు తెలుగులో వేరుగా ఏమీ లేవు. లింగ, వచన బోధక నామాలే ప్రథమా విభక్తినీ బోధిస్తాయి.

రాముఁడు (2:4650 తర్వాతి వచనంలో)
కోడలు (2:4562)

చుట్టము(3:1672)

ప్రథమా విభక్త్యంత రూపాలకు సంబంధించిన చర్చ లింగం( ), వచనం(చూ.పు. )అనే విభాగాలలో ఉంది.

## 3.6.5 ద్వితీయాది విభక్తి రూపాల నిర్మాణం (formation of oblique cases)

ద్వితీయాది ఔపవిభక్తిక, అనౌపవిభక్తిక రూపాల నిర్మాణాన్ని కింద సూచించిన విధంగా నిరూపించవచ్చు.

(i) (ఔపవిభక్తిక నామం+ఔపవిభక్తిక ప్రత్యయం)+ద్వితీయాది విభక్తి ప్రత్యయం=ద్వితీయాది ఔపవిభక్తిక రూపం

(ii) (అనౌపవిభక్తిక నామం+ద్వితీయాది విభక్తి ప్రత్యయం)= ద్వితీయాది అనౌప విభక్తిక రూపం

### 3.6.5.1 అధికాంశం (increment)

అనౌపవిభక్తిక రూపాల్లో ఉదంత ప్రాతిపదికలమీద చతుర్థీ -కై, పంచమీ -కంటె, షష్ఠీ -కున్, సప్తమీ -అన్(ఉ)/-అందున్ అనే ప్రత్యయాలు చేరేపుడు వాటి ముందు -న అనే అధికాంశం వస్తుంది.

(i) -కై:

మడుపునకై(2:1838)
నేరమునకై(2:10168)
లోకమునకైన(3:934)
గోరునకైన(3:2897)

(ii) పంచమీ విభక్తి ప్రత్యయం "-కంటె" కి ముందు అధికాంశం చేరిన రూపం శ్రీ రామాయణంలో లేదు

(iii) -కున్:

దక్షునకును(4:219)
మోమునకు(4:406)

జగతీశునకు(4:419)
కుమారునకు(4:430)

(iv) -అన్(ఉ):
దినంబునను(1:76)
తోఁచినను(1:610)
దేశమునను(1:839)

(v) -అందున్:
లోకమునందు(2:3184)
నికటంబునందు(2:3362)

## 3.6.6 ద్వితీయాది విభక్తి ప్రత్యయాలు

శ్రీరామాయణం కావ్యంలోని ద్వితీయాది విభక్తి ప్రత్యయాలు ఉదాహరణ పూర్వకంగా కింద వివరించబడ్డాయి.

### 3.6.6.1 ద్వితీయా విభక్తి ప్రత్యయాలు

/-ని ~ -ను ~ -న్ ∅/

(i) -ని~:
ఇది ఇకారాంత ప్రాతిపదికలపై వస్తుంది.

గిరిని (1:434)
భక్తిని (1:1764)
స్రవంతినిఁ (1:2135)
మానిసినిఁ (6:1715)

(ii) -ను~:
ఇది ఇకారేతర అచ్చులతో అంతమయ్యే ప్రాతిపదికలపై వస్తుంది.

లోభమును (2:2571)
త్రోపులను (2:1810)

నెరసునుఁ (6:505)
సామంతులనుఁ (2:1896)

(iii) శూన్యం(∅)

ఇది అమహద్వాచక నామాలపై వికల్పంగా వస్తుంది. రానపుడు ని/నులు ప్రవర్తిల్లుతాయి.

| శూన్యం (∅) వచ్చిన రూపం | శూన్యం(∅) రాని రూపం |
|---|---|
| క్రొవ్వు (3:5812) | జానకిఁ (5:582) |
| నోరు (4:5788) | మౌళిఁ (3:5560) |

## 3.6.6.2 తృతీయా విభక్తి ప్రత్యయాలు

శ్రీరామాయణం కావ్యంలో తృతీయా విభక్త్యర్థంలో -
/-చే(త)న్/
/ ~ -తో(న్)~-తోన~ -తోడ(న్)~ -తోడి(న్) -తో(న్)/
/-మైఁ(న్)/ అనే ప్రత్యయాలు వస్తున్నాయి. ఇవి ఉదాహరణ పూర్వకంగా కింద వివరించబడ్డాయి.

(i) /-చే(త)న్/:

ఇది హేత్వర్థంలో, -నుండి అనే అర్థంలో, కర్త్రర్థంలో, కర్మణి ప్రయోగంలో ప్రయుక్తమౌతుంది.

హేత్వర్థంలో:

"కల్మషాపహము భా-గ్యవశంబు చేత/నీకు లభించె" (1:120, 121)
"... రంగని దాన మహిమచే మించె" (1:194)
"అల యగస్త్యుని చేత-నైంద్రమైనట్టి" (1:357)
"అమ్ముచే క్రౌంచ-మ్ముర్వి పైఁ గూల" (1:542)

నుం(డి)చి అనే అర్థంలో:

"తనయులచేఁ గాదె-తామున్ను వినియె" (1:160)
"...జనులచేఁ-బట్టాభిషేక/పరమోత్సవము నొందె" (1:489, 490)
"హరిణాక్షి శబరిచే-నర్చలందుటయుఁ" (1:714)

కర్త్రర్థంలో:

ఆ వనితచేఁ బూజలు గాంచి (1:400)
అనలుచే పరిశుద్ధమైన జానకిని (1:475)

కర్మణ్యర్థంలో:

"కిరణావళిచేత భానుడొప్పె" (1:957)

(ii) / ~ -తోఁ(న్)~-తోన~ -తోడ(న్)~ -తోడి(న్) -తోఁ(న్)/

ఉపకరణాన్ని తెలిపే సందర్భంలో:

చంచూ పుటంబుతోఁ (1:537)
మేనితోఁ బొరలు ప్రాణేశుఁ (1:550)

సహార్థంలో:

జాంబవదాదులతోడ (1:464)
భరద్వాజుని తోడ (1:563)
సీతతో పురికి నేతేర (1:661, 662)
సుగ్రీవుతోఁ జెలిమిఁ బూనుటయు (1:178)

వచ్యర్థ క్రియకు ముందు:

వాలితోఁ గావింపు మనుచుఁ (1:422)
నగు మోముతోడ నానతి యిచ్చె (1:598)

## 3.6.6.3 చతుర్థీ విభక్తి ప్రత్యయాలు

శ్రీ రామాయణం కావ్యంలో-

/-కై/, /-కొఱకు ~ -కొఱకై/ అనే చతుర్థీ విభక్తి ప్రత్యయాలు ప్రయోజనార్థంలో ప్రయుక్తమయ్యాయి. /-పొంటెన్/, /-కోసమై/అనే చతుర్థీ విభక్తి ప్రత్యయాలు ప్రాచీన రనచల్లో కనిపిస్తున్నాయి. (చూ. అనంతరామశాస్త్రి. 1982:196, 197) శ్రీ రామాయణంలో /-పొంటెన్/, /-కోసమై/లు చేరిన రూపాలు లేవు.

(i) /-కై/:

ఈ ప్రత్యయం ఉదంత ప్రాతిపదికలపై చేరేపుడు "-న" అనే అధికాంశం (increment) వస్తుంది. దీనికి సంబంధించిన చర్చ అధికాంశం (increment) అన్న విభాగంలో ఉంది.(చూ. 3.6.5.1) తక్కిన ప్రాతిపదికలపై 'కై'చేరిన ఉదాహరణలు.

ఏమిటికై యంగరాజు రప్పించె (1:1039, 39)
పండ్లకై మనసూరనట్టి (1:1153)
సకలాంగ రక్షణకై చాల మంత్రించి (1:2031)

(ii) /-కొఱకు ~ -కొఱకై/:

శ్రీ రామాయణంలో /-కొఱకు~/ ప్రత్యయం కూడిన రూపాలు ఎక్కువగానే ఉన్నాయి. /-కొఱకై/ చేరిన రూపం మాత్రం ఒక్కటే ఉంది.

ఒక్కని కొఱకు దైత్యుల నెల్లఁ జంప (6:8059)
జానకి కొఱకునై చచ్చువాఁడు... (6:8349)
లోకోప వాదంబు కొఱకు...(6:11258)
నీ కొఱకు బ్రహ్మాది దేవతలు...(6:11341)
రాముని కొఱకై (6:2990 తర్వాతి వచనంలో. ఏకైకప్ర.)

## 3.6.6.4 పంచమీ విభక్తి ప్రత్యయాలు

శ్రీరామాయణం కావ్యభాషలో- /-నుండి/, /-కంటెన్ ~-కన్నన్/, /-పట్టి/ అనే ప్రత్యయాలు పంచమీ విభక్తిలో ప్రయుక్తమవుతున్నాయి.

(i) /-నుండి/:

స్థలార్థకాలపై ఈ ప్రత్యయం చేరుతుంది.

ఆకసమ్ము నుండి...(1:30)
ఉచితాసనంబుల నుండి (1:1399)

(ii) /-కంటెన్ ~-కన్నన్/:

-కంటెన్:
గురుని మాట కంటె...(2:10096 తర్వాతి వచనంలో)
ఇంత కంటె తోఁచదు (6:916)

క్రియా ధాతువులమీద -కంటె చేరుతుంది.

"...నుండు కంటె విష ప్రయోగంబె మేలు" (2:4888, 889)

~కన్నన్:

ఇంతటికన్న హెచ్చయిన హితము (4:2456)
అంతకన్న మెత్తన (4:3123, 124)

(iii) /-పట్టి/:
(పట్టు ధాతు క్త్వార్థ రూపం. ఇది చేరినపుడు గ్రహించి అనే అర్థం ఇస్తుంది.)

"...నన్నుఁ జేపట్టి..." (2:2133)

## 3.6.6.5 షష్ఠీ విభక్తి ప్రత్యయాలు

శ్రీరామాయణంలో కనిపించే షష్ఠీ విభక్తి ప్రత్యయం /-కున్ ~ -కిన్/ '-కిన్' ఇ, ఈలతో అంతమయ్యే నామ ప్రాతిపదికలమీద, హ్రస్వ ఇకారంతో అంతమయ్యే సర్వనామ ప్రాతిపదికలమీద చేరుతుంది. -కున్ ప్రత్యయం ఇతర ప్రాతిపదికలపై వస్తుంది. షష్ఠీ విభక్తి సంబంధార్థంలో వస్తుంది. దీనినే సంప్రదాయ వ్యాకరణాలు శేష షష్ఠి అన్నాయి. దీనికి "-యొక్క" చేరుతుందని బాలవ్యాకర్త